# సింగిల్ పేజీ కథలు

## పరీక్షలు

**పరీక్ష హాలు చాలా నిశ్శబ్దంగా ఉంది. విద్యార్థులంతా తలవంచుకుని పరీక్ష రాయటంలో నిమగ్నమై ఉన్నారు. రాఘవయ్య మాస్టారు పిల్లలందరినీ ఓ కంట కనిపెడుతూ అటూ ఇటూ పచార్లు చేస్తున్నారు. వాళ్లంతా 7వ తరగతి వార్షిక పరీక్షలు రాస్తున్నారు. ఆ రోజు నుండే పరీక్షలు ప్రారంభం.**

పరీక్ష రాస్తున్న వాళ్లల్లో ముందు నుండి నాలుగవ వరుసలో మధ్య బెంచీ మీద కూర్చున్న రాజు తల వంచుకుని దీక్షగా పరీక్ష రాస్తున్నట్లు నటిస్తున్నాడు. అతనికి ప్రశ్నాపత్రం లోని ఏ ఒక్క ప్రశ్నకు కూడా సమాధానం తెలియటం లేదు. ఏం రాయాలో తోచటం లేదు.

ఇంతలో "సార్.." అంటూ అటెండర్ లోపలికి వచ్చి పరీక్షకు సంబంధించిన మరికొన్ని పత్రాలు, దారాలు వంటివి అందజేయటానికి మాస్టార్ని పిలిచాడు.

మాస్టారు అతని దగ్గరకు వెళ్లారు. రాజు వెంటనే తన జేబులో నుండి నాలుగైదు మడతలు పెట్టి ఉన్న ఒక కాగితాన్ని బయటికి తీసి గబగబా మడతలు విప్పి రాస్తున్న పేపర్ కింద దాచేశాడు. మాస్టారు మళ్లీ అటూ ఇటూ తిరగటం మొదలు పెట్టారు. రాజు ఆయన చూడకుండా ఆ కాగితంలోకి చూస్తూ పేపర్ మీద ఏదో గెలుకుతూ కొంతసేపు గడిపాడు. రాజు కూర్చున్న బెంచీ సరిగ్గా ఫ్యాన్ కింద ఉండడంతో రాజు అలా చూస్తూ రాసే సమయంలో గాలికి పేపరు కదిలి ఒక్కసారిగా ఆ చీటీ ఎగిరి కింద పడింది. తన పక్కనే ఆ కాగితం పడటంతో వెంటనే రాజు దాని మీద కాలు పెట్టి మాస్టారికి కనిపించకుండా దాచేశాడు.

అప్పటివరకు పచార్లు చేస్తున్న మాస్టారు రాజు పక్కనే ఫ్యాన్ కింద కుర్చీ వేసుకుని కూర్చున్నారు. రాజు పని ఇరకాటంలో పడింది. కాలి కింద పేపర్ తీసి దాచేయలేడు. చూసి రాయనూ లేడు. చూస్తుండగానే పరీక్ష సమయం పూర్తయింది. ఒకరొకరుగా తరగతిలోని విద్యార్థులందరూ పరీక్ష రాసిన పేపర్స్ మాస్టారికిచ్చి బయటికి వెళ్లిపోయారు. రాజు కూడా తన పేపరు మాస్టారికిచ్చి లేచి వెళ్లబోతూ ఉండగా "ఆగు రాజు! ఆ కాగితం ఇటిచ్చి వెళ్లు" అన్నారు.

రాజు భయంతో వణుకుతూ కిందపడిన కాగితం తీసి మాస్టార్‌కిచ్చి "సార్! నేను.." అంటూ ఏదో చెప్పబోయాడు.

"నువ్వు వెళ్లు రాజు! నేను తరువాత నీతో మాట్లాడతాను" అన్నారు మాస్టారు.

సాయంకాలం రాఘవయ్య మాస్టారు రాజు వాళ్ల ఇంటికి వెళ్లారు.



"రండి మాస్టారు!" అంటూ సాదరంగా ఇంట్లోకి ఆహ్వానించాడు రాజు తండ్రి చంద్రయ్య.

ఉపోద్ఘాతం లేకుండానే రాజు పరీక్షల్లో కాపీ కొట్టి రాయటం గురించి ప్రస్తావించారు మాస్టారు. చంద్రయ్య రాజు ప్రవర్తనకు చాలా కంగారుపడ్డాడు.

"మేము పరీక్షలకు చదవమని రాజుకు ఎంతగానో చెప్తూ ఉంటాం. కానీ ఎక్కువ సమయం టీవీ చూస్తూనో, ఆటలతోనో గడుపుతూ ఉంటాడు" అన్నాడు చంద్రయ్య. రాజు బిక్కుబిక్కుమని చూస్తూ దూరంగా నిలబడ్డాడు. రాఘవయ్య మాస్టారు రాజు చెయ్యి పట్టుకొని దగ్గరగా తీసుకుంటూ "చూడు రాజూ! నువ్వు వయసులో చాలా చిన్నవాడివి. ముందు ముందు ఎంతో భవిష్యత్తు ఉన్నవాడివి. పరీక్షలలో కాపీ కొట్టి రాయటం అనేది చాలా తప్పు. ఇటువంటి అలవాట్లు ఎప్పటికైనా ముప్పు తెచ్చి పెడతాయి. ఎవరూ చూడటం లేదు కదా అని కూడా తప్పు పనులు చేయకూడదు. ఎవరి మనసే వాళ్లకు సాక్షి. ఏవయినా తప్పులు చేయబోయే ముందే 'ఇది తప్పు. ఈ పని చేయకూడదు' అని ఎవరి మనసు వాళ్లను హెచ్చరిస్తూ ఉంటుంది. అందుకే తప్పు పనులు చేసేటప్పుడు భయపడుతూనే చేస్తారు. నేను నిన్ను అక్కడే అప్పటికప్పుడే మందలించి ఉండవచ్చు. అలా చేస్తే నీవు చూసి రాస్తున్నట్లు అందరికీ తెలిసిపోతుంది. ప్రిన్సిపాల్‌గారికి తెలిస్తే నిన్ను పరీక్షల నుండి డిబార్ చేసినా చేయవచ్చు. దాని వల్ల నీ సంవత్సరం చదువు వృధా అవుతుంది. ఇది నీకే గాక నీ తల్లిదండ్రులకు కూడా ఎంతో అవమానంగా ఉంటుంది. అంతేకాదు నీలో మార్పు రావాలని నేను ఆశిస్తున్నాను. కష్టపడి చదివి పరీక్ష రాసి ఉత్తీర్ణులవ్వటంలో ఉండే ఆనందం, గొప్పతనం చూసి రాసి పాసవ్వటంలో ఉండదు. మరి ఏం చేస్తావు? ఇక నుండి బాగా చదువుతావా లేక ఇలాగే..." అంటూ మాట్లాడుతున్న మాస్టారిని చూసి రాజు ఒక్కసారిగా "మాస్టారూ! తప్పయిపోయింది మాస్టారూ! ఇంకెప్పుడూ అలా చేయను మాస్టారూ!" అంటూ వెక్కివెక్కి ఏడవసాగాడు.

"ఊరుకో రాజూ" అంటూ అతని భుజంపై తట్టి "నీలో ఈ మార్పునే నేను కోరుకున్నాను. ఇక నుండి కష్టపడి చదివి పరీక్షలు రాయి. ఏమైనా సందేహాలుంటే నా దగ్గరికి రా" అంటూ ఓదార్చారు.

"చూడండి చంద్రయ్యగారు నేను ఇలా అంటున్నానని మీరు మరోలా అనుకోవద్దు. కేవలం పిల్లల్ని చదువు చదువు అంటూ పోరటం వల్ల సరిపోదు. అందుకు తగిన వాతావరణాన్ని కూడా వాళ్లకు మనం కలిగించాలి. పరీక్షల సమయంలోనైనా పిల్లల కోసం పెద్దవాళ్లు టీవీ చూడటం మానుకోవాలి. అప్పుడు పిల్లలు కూడా మానేస్తారు. సమయానికి తగిన ఆహారం, నిద్ర అన్నీ సమకూరేలా చూడాలి. పిల్లల కోసం మనం మన అలవాట్లను మార్చుకోవటంలో తప్పు లేదు. 'మొక్కై వంగనిది మానై వంగదు' అంటారు కదా! చిన్నప్పుడే వాళ్ల పొరపాట్లను సరిదిద్ది సరైన మార్గదర్శనం చేయకపోతే తరువాత విచారించి ప్రయోజనం ఉండదు. నా సూచనను గమనిస్తారనుకుంటాను. మరి వస్తాను సెలవు" అంటూ నమస్కరించి "వస్తాను రాజా!" అంటూ బయటికి నడిచారు రాఘవయ్య మాస్టారు.

**-అబ్బరాజు జయలక్ష్మి**
**(హైదరాబాద్)**